క్లుప్తంగా

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కాజులూరు: మండల గ్రామాలలో సోమవారం జరుగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మండల తహసీల్దారు శాంతిలక్ష్మి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 26 గ్రామాలలో 70 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తాగునీరు వసతి ఏర్పాటు, అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్ సదుపాయం కల్పించామన్నారు. మండలంలో పలుచోట్ల సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఎక్కడ అవాంచనీయ సంఘటను జరుగకుండా కట్టుదిట్టమైన చ్యేలు తీసుకున్నామన్నారు. ప్రజలు ప్రశాంతంగా ఓట్లు వేయాలన్నారు.

రాయవరంలో భారీ వర్షం



రాయవరం ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

రాయవరం: రాయవరంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కమ్ముకున్న కారుమేఘాలతో వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పల్లపుప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి ఇటుక బట్టీల యజమానులు, రహదారుల వెంబడి ధాన్యాన్ని ఆరబోసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



ఏరియా ఆసుపత్రి వద్ద నర్సులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మూర్తి

రామచంద్రపురం: ఆసుపత్రుల్లో రోగులకు నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారందరికి అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు తొగరు మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులకు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ వైద్య రంగంలో కీలకమైన నర్సుల గౌరవాన్ని, హుందా తనాన్ని తీసుకువచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజు సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకొంటున్నారన్నారు. ఏరియా హాస్పిటల్‌తో ప్రతిరోజు వందలాది మంది రోగులకు సేవలను అందజేస్తున్న నర్సులకు ఈ సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టిన సిస్టర్స్ సేవలను మరువలేమని తెలిపారు.

నేడు కనక మహాలక్ష్మమ్మ జాతర

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత శ్రీకనక మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవం సోమవారం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ తులా నాగరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం నుంచి 17వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. రాత్రి అమ్మవారి జాతర, మంగళవారం అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారని, బుధవారం అమ్మవారి తీర్థం నిర్వహిస్తారన్నారు. 17న అన్న సమారాధన ఉంటుందని చైర్మన్ తెలిపారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా శంకరాచార్య జయంతి

అంబాజీపేట: ముక్కామల శ్రీఆది శంకరాచార్య స్వామివారి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్య స్వామి జయంతి మహోత్సవాలను ఆదివారం నిర్వహించారు. కంచి కామకోటి పీఠాధిపతులు శంకర విజయేంద్ర సరస్వతి స్వామివారి అనుగ్రహంతో ఆలయ ధర్మకర్త దువ్వూరి బాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో అర్చకుడు వెలవలపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రి ఆధ్వర్యంలో శంకరాచార్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కంచి కామకోటి శైవాగమ పాఠశాల విద్యార్థులచే ఆది శంకరాచార్య స్వామివారికి వేదపఠనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

యానాం: కనకాలపేటలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి విశేష పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో పోలేరమ్మ వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సామూహిక సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ, పోలేరమ్మ యూత్ పాల్గొన్నారు.

అనుక్షణం పేదల పక్షం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు
- ప్రతి కుటుంబానికి లబ్ధి
- సామాన్యులకు అండగా నిలిచిన సర్కారు

కపిలేశ్వరపురం: ప్రభుత్వమంటే పేదల పక్షం వహించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలపై దృష్టి సారించాలి. ఆర్థిక కారణాలు చెప్పి సమస్యల పరిష్కారాన్ని విస్మరించరాదు. ఎన్ని సమస్యలు ఎదురైనా పేదల సంక్షేమమే లక్ష్యం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో అదే జరుగుతోంది. దేశం మొత్తంలో ఏ ఇతర రాష్ట్రంలోనూ అమలు చేయని స్థాయిలో సంక్షేమాన్ని ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేశారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఆ పథకాలన్నీ ప్రజలకు చేదోడుగా నిలిచాయి. మండపేట నియోజకవర్గంలో సంక్షేమ సాయంపై ఈ కథనం..

నియోజకవర్గంలో పేదలకు ఆసరాగా..

వైఎస్సార్ పింఛను పథకం ద్వారా మండపేట పట్టణంలో 7,107 మందికి రూ.94,41,00,000, రూరల్ మండలంలో 13,726 మందికి



పింఛను డబ్బులు అందుకుంటున్న లబ్ధిదారు (ఫైల్)

123,19,50,500, కపిలేశ్వరపురం మండలంలో 17,447 మందికి రూ.198,89,58,000, రాయవరం మండలంలో 11,773 మందికి రూ.110,65,52,000 సాయమందించారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి

జగనన్న అమ్మఒడి పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 8,127 మందికి రూ.30,91,67,447, మండపేట పట్టణంలో 4,465 మందికి రూ. 24,88,00,000 కపిలేశ్వరపురం మండలంలో 6,841 మందికి రూ.27,99,96,535, రాయవరం మండలంలో 5,913 మందికి రూ.26,35,61,392 విలువైన సాయాన్ని విద్యార్థులకు అందజేసింది. జగనన్న విద్యా కానుక పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2672 మందికి రూ.16,74,57,112, రాయవరం మండలంలో 3277 మందికి రూ.2,32,73,254 సాయమందించింది.

పేదల ఆరోగ్య పరిరక్షణ

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2,597 మందికి రూ.10,06,88,818 కపిలేశ్వరపురం మండలం 2,822 మందికి రూ.11,64,99,517 రాయవరం మండలంలో 3,009 మందికి రూ.12,21,20,444 మండపేట పట్టణంలో 2,338 మందికి రూ.9,61,00,000 సాయమందించింది. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 2,897 మందికి రూ.5,00,68,314 రాయవరం మండలంలో 2,095 మందికి రూ.1,52,33,125 సహకారం అందించింది.

రైతుకు బాసటగా నిలిచిన ప్రభుత్వం

వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా మండపేట రూరల్ మండలంలో 7,002 మందికి రూ.29,84,54,435, మండపేట పట్టణంలో 2,073 మందికి రూ.7,19,00,000, కపిలేశ్వరపురం మండలంలో 8,746 మందికి రూ.38,63,77,288, రాయవరం మండలంలో 7,435 మందికి రూ.31,96,76,950 పెట్టుబడి సాయమందించింది. ఇన్‌పుట్ సబ్సిడీ పథకం ద్వారా మండపేట మండలంలో 4,621 మందికి రూ.4,26,11,050, రాయవరం మండలంలో 5,796 మందికి రూ.6,19,68,231 సాయమందించింది.

వృద్ధులను కొడుకులా చూసుకుంటున్నాడు



75 ఏళ్ల వయస్సులో వైకల్యంతో జీవితాన్ని గడుపుతున్నాను. కొడుకు చనిపోవడంతో బాధల్లో ఉన్న నాకు సీఎం జగన్ దేవుడయ్యాడు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జామున ఆరు గంటలకు వలంటీర్ ద్వారా రూ.3వేలు వికలాంగ పింఛను ఇస్తున్నాడు. నాలాంటి ఎందరికో ఆధారమైన సీఎం జగన్ మళ్లీ సీఎం కావాల్సిన అవసరం ఉంది.

– పైడిమల్ల ఎస్సయ్య, ఏడిద, మండపేట మండలం

నియోజకవర్గంలో 58 నెలల్లో ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం ఇలా..

పథకం	లబ్ధిదారులు	సాయం మొత్తం (రూ.లలో)
వైఎస్సార్ పింఛను కానుక	50,053	527,15,60,500
వైఎస్సార్ ఈబీసీ నేస్తం	3,233	9,19,07,131
జగనన్న అమ్మఒడి	25,346	110,15,25,374
అర్చకులు, పాస్టర్లు	29	2,00,000
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	4,992	6,53,01,439
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	10,766	43,54,08,779
వైఎస్సార్ ఆసరా	49,039	151,28,09,113
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	12,586	39,67,33,690
వైఎస్సార్ కల్యాణమస్తు/షాదీ తోఫా	278	1,27,08,004
వైఎస్సార్ కాపునేస్తం	5,644	31,06,21,268
కరోనా ప్రత్యేకసాయం	41,025	4,09,91,739
జగనన్న చేదోడు	3,925	4,61,95,000
వైఎస్సార్ చేయూత	15,266	69,48,83,773
జగనన్న తోడు	2,062	8,89,892
వైఎస్సార్ నేతన్న నేస్తం	415	3,24,76,000
వైఎస్సార్ బీమా	664	11,16,25,000
వైఎస్సార్ మత్స్యకార భరోసా	1,321	12,05,48,250
వైఎస్సార్ రైతు భరోసా	25,256	107,64,08,673
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	10,417	10,45,79,281
జగనన్న వసతి దీవెన	10,677	23,09,73,321
వైఎస్సార్ వాహన మిత్ర	1,099	3,47,10,000
వైఎస్సార్ విదేశీ విద్యా దీవెన	913	4,56,22,050
జగనన్న విద్యా దీవెన	13,736	48,53,23,686
పంట రుణాల సున్నా వడ్డీ	20,321	7,77,94,246
ఎస్‌హెచ్‌జీఎస్ సున్నా వడ్డీ	23,886	4,44,77,875
జగనన్న విద్యా కానుక	5,949	19,07,30,366
ట్యాబ్‌ల పంపిణీ	1,079	1,58,72,847
జగనన్న గోరుముద్ద	5,318	6,59,80,489
వైఎస్సార్ సంపూర్ణ పోషణ	8,032	15,93,73,692
వైఎస్సార్ కంటి వెలుగు	1,345	19,55,48,147
ఇంటింటికి రేషన్	23,327	48,09,48,566



కౌంటర్లలో సామగ్రి కోసం వేచి ఉన్న సిబ్బంది



రామచంద్రపురంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఈవీఎంలు, మెటీరియల్‌తో వెళుతున్న పోలింగ్ సిబ్బంది



మండపేట నుంచి వాహనంలో కేంద్రానికి తరలివెళ్తున్న సిబ్బంది

పోలింగ్‌కు వేళాయె..

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా
- నియమావళి మేరకు సిబ్బంది సిద్ధమన్న ఆర్‌ఓ ఎల్లారావు
- మండపేట నియోజకవర్గంలో 223 పోలింగ్ కేంద్రాలు, 24 రూట్లుగా కేంద్రాల విభజన, 446 ఈవీఎంలతో నేడు పోలింగ్ ప్రక్రియ

కపిలేశ్వరపురం/మండపేట: సార్వత్రిక ఎన్నికల ఘట్టంలో కీలక దశ పోలింగ్ సోమవారం జరగనుంది. ఓటరు తన ఓటును వినియోగించుకోవడం ద్వారా తీర్పును ఇవ్వనున్నారు. అందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలోని మండపేట రూరల్, పట్టణం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలను అందజేశారు. నిర్దేశించిన రూట్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనాల్లో సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఆదివారం రిసెప్షన్ కౌంటర్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పర్యవేక్షించారు. నియోజకవర్గ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి డీవీఎస్ ఎల్లారావు, మున్సిపల్ కమిషనర్ బి.రాము స్థానిక పరిస్థితులను కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వివరించారు. నియోజకవర్గంలో 223 కేంద్రాల్లో పోలింగ్ జరగనున్న నేపథ్యంలో వాటన్నింటిని 24 రూట్లుగా నిర్దేశించారు. 446 ఈవీఎంలను ఉపయోగిస్తున్నారు. ఒక పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, ఓపీఓ చొప్పున మొత్తం 223 కేంద్రాలకు గానూ 1,446 మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లు, తదితర మౌళిక సదుపాయాలను అధికారులు పర్యవేక్షించారు. కేంద్రం ఆవరణలో అవసరమైన మేరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను సాంకేతికతతో పర్యవేక్షిస్తున్నారు. అందులో భాగంగా 136 వెబ్ కాస్టింగ్ సిబ్బంది కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలోని శాంతి భద్రత పర్యవేక్షణ కోసం అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ, ఒక్కొక్కరు చొప్పున, 10 మంది సీఐలు, 17 మంది ఎస్ఐలు నియమితులయ్యారు. వారందరితో కలిపి మొత్తం 389 మంది పోలీస్ సిబ్బంది శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యతలను చూస్తున్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రంలోకి ఓటు వేసేందుకు ఓటరును మాత్రమే అనుమతించేలా పోలీస్ శాఖ అధికారులు తగిన జాగ్రత్తలను తీసుకుంటూ ఏర్పాట్లు చేసుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోండంటూ ఓటర్లను చైతన్యపర్చుతూనే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరిధిలో చర్యలు తప్పవంటూ మైక్ ద్వారా వాహనాల్లో హెచ్చరికలు చేస్తున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో...

రామచంద్రపురం: నియోజకవర్గంలో పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. పట్టణంలోని వీఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఆయా పోలింగ్ బూత్‌లకు బస్సులు, ఇతర వాహనాల ద్వారా ఈవీఎంలు, సిబ్బంది తరలివెళ్లారు. ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ కేంద్రం వద్దకు ఆర్వో ఎస్.సుధాసాగర్, ఏఆర్వో వెంకటేశ్వర్లు ఇతర ఎన్నికల అధికారులు చేరుకున్నారు. రిజర్వు సిబ్బందితో పాటుగా మొత్తం 1434 మందిని ఎన్నికల విధులకు నియమించారు. వీరందరూ వీఎస్ఎం కళాశాల వద్ద జరిగిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకున్నారు. రామచంద్రపురం అర్బన్, రూరల్, కాజులూరు, కె.గంగవరం మండలాల్లో 137 లొకేషన్స్‌లో 239 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. మొత్తం 239 పోలింగ్ బూత్‌లకు గాను 239 ఈవీఎంలతో పాటుగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో ఒక పీవో, ఒక ఏపీఓ నలుగురు ఓపీవోలు ఇతర వైద్య సిబ్బంది బస్సుల్లో తరలివెళ్లారు. నియోజకవర్గంలోని 239 పోలింగ్ కేంద్రాలకు గాను 24 రూట్‌లుగా విభజించారు. ప్రతీ రూట్‌కు రెండు బస్సుల్లో నాలుగు నుంచి అయిదు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మెటీరియల్‌తో పాటు సిబ్బందిని తరలించారు. వీటి కోసం ఆర్టీసీ నుంచి 15 బస్సులను ఏర్పాటు చేశారు. బస్సులు వెళ్లని రూట్లకు 8 టాటా ఏసీ వ్యాన్లను ఏర్పాటు చేశారు. రామచంద్రపురం అర్బన్‌లో 35758 కాగా మహిళలు 18556, పురుషులు 17202 ఉన్నారు. రూరల్‌లో 56204, మహిళలు 29374, థర్డ్ జండర్ ఒకరు, పురుషులు 28829. కాజులూరు మండలంలో 56950 మహిళలు 28475, పురుషులు 28475, కె.గంగవరం మండలంలో 52295కాగా మహిళలు 26119, 26176 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 239 పోలింగ్ కేంద్రాలలో నేడు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కెమోరాతో పాటుగా సూక్ష్మ పరిశీలకులను కూడా ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోలింగ్‌కి ముందు మాక్ పోలింగ్‌ను ఏజెంట్ల సమక్షంలో అధికారులు నిర్వహిస్తారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన తరువాత మొదటి ఓటును పార్లమెంటుకు ఇస్తారు. అనంతరం అసెంబ్లీకి ఓటు ఇస్తారు. దివ్యాగుల కోసం ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద మూడు చక్రాల వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు నేతృత్వంలో పోలీస్ అధికారులు పోలింగ్ సజావుగా సాగేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. మొబైల్ పోలీస్ వాహనాలతో పాటుగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులను ఏర్పాటు చేశారు.



సామగ్రి పంపిణీపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఎన్నికలకు సర్వం సిద్ధం

రామచంద్రపురం రూరల్/కె.గంగవరం: రామచంద్రపురం మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని మొత్తం 76 పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఓట్లు వేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎటువంటి తోపులాటలు జరగకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఓటర్లు ఎండ బారిన పడకుండా టెంట్లు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 26 గ్రామాలకు గాను 65 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు టెంట్లు, బారికేడ్లు, తాగునీరు తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌ల వద్ద వెబ్‌కాస్టింగ్ కోసం కెమెరాలు ఏర్పాట్లు చేశారు.



ద్రాక్షారామ గ్రామ సచివాలయం వద్ద బారికేడ్లతో ఓటర్ల కోసం సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రం

పెరిగిన మహిళా ఓటర్లు

- మండపేట నియోజకవర్గంలో 1,13,111 మంది
- రామచంద్రపురం నియోజకవర్గంలో 1,02,307 మంది
- పార్లమెంటు నియోజకవర్గంలో 7,70,589 మంది

కపిలేశ్వరపురం: ఆకాశంలో సగమున్నామంటూ గర్వంగా చెప్పుకునే మహిళా లోకం నేడు జరగనున్న సార్వత్రి ఎన్నికల్లో సైతం కీలక పాత్రను పోషించనున్నారు. ఆదిమ సమాజంలో ధైర్య సాహసాలతో ఎదురొడ్డి జీవించిన మహిళ తర్వాత సమాజాల్లో వెనుకబాటుకు గురైంది. ఆధునిక సమాజంలో ప్రజాస్వామిక చైతన్యం పెరిగిన నేపథ్యంలో తిరిగి వారి ప్రాధాన్యత గణనీయంగా పెరిగింది. విద్యారంగంలో విశేష ప్రతిభను కనబర్చుతున్న తరుణంలో రాజకీయ సామాజిక రంగాల్లో సైతం మహిళలు తమ చాతుర్యాన్ని చాటుతున్నారు. వారిలోని చైతన్యం కేంద్ర,, రాష్ట్ర ప్రభుత్వాల ఏర్పాటులో ప్రదర్శితమవనుంది.

రెండు నియోజకవర్గాల్లో దివ్యాంగ ఓటర్లు

దివ్యాంగులు రెండు నియోజకవర్గాల్లో గణనీయంగా ఉన్నారు. ప్రత్యేక అవసరాలు గలవారికి ఓటు వేసే నిమిత్తం తగిన సదుపాయాలను కల్పించారు.



టేకి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు క్యూకట్టిన మహిళా ఓటర్లు (ఫైల్)

రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు

నియోజకవర్గం	18-19సం.	20-29సం.	30-59సం.	60-70సం.	70-100సం.	మొత్తం
మండపేట	2,628	19,460	72,871	11,312	6,840	1,13,111
రామచంద్రపురం	2,261	16,505	64,159	11,493	7,888	1,02,307
అమలాపురం పార్లమెంట్	16,920	1,25,311	4,90,858	84,528	52,968	7,70,589

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	మొత్తం
మండపేట	2443	1609	4052
రామచంద్రపురం	2231	1430	3661
అమలాపురం పార్లమెంట్	15747	10273	26020

నిర్భయంగా ఓటు వేయండి



డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్వో సుధాసాగర్

- ఆర్వో సుధాసాగర్
- వీఎస్ఎం కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీ పరిశీలన

రామచందరపురం: స్థానిక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్లు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్ పిలుపునిచ్చారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ తీరును ఆయన పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు వేసేందుకు ప్రజాస్వామ్య పండుగకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకుని ఓటింగ్ శాతాన్ని పెంచాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భారీగా బందోబస్తు వెబ్ కాస్టింగ్ చిత్రీకరణ ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద సూక్ష్మ పరిశీలకులు, కెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సిబ్బంది పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్‌కు 90 నిమిషాల ముందుగా మాక్ పోల్ నిర్వహించిన అనంతరం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిష్పక్షపాతంగా, ఏ విధమైన అపోహలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. బృందాలకు ఎక్కడైనా పోలింగ్ కేంద్రాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో సాంకేతిక లోపాలు ఉత్ప న్నమైతే వాటి స్థానంలో మరొక యూనిట్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది

రాయవరం: సాధారణ ఎన్నికల్లో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి జరగనున్న పోలింగ్ నిర్వహణకు సంబంధించిన పోలింగ్ సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని 53 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ కేంద్రమైన మండపేటలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లతో పాటుగా, ఇతర పోలింగ్ మెటీరియల్‌ను అందజేశారు. పోలింగ్ మెటీరియల్‌ను తీసుకున్న సిబ్బంది వారికి కేటాయించిన వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సిబ్బంది సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి ప్రారంభమయ్యే మాక్ పోలింగ్, అనంతరం జరిగే రియల్ పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లలో మునిగిపోయారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్‌వీ కృష్ణారావు ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి భోజన వసతి సదుపాయాలను ఏర్పాటు చేశారు.



పోలింగ్ కేంద్రంలో పోలింగ్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటున్న సిబ్బంది